'లగచర్ల' డైవర్షన్‌కే మూసీ నిద్ర

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఇప్పుడు మూసీ బాధితుల ఆక్రందన గుర్తొచ్చిందా?
- కాంగ్రెస్, బీజేపీది తోడుదొంగల నాటకం
- మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): హైడ్రాను మొదట స్వాగతించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి మూసీ బాధితుల ఆక్రందన ఇప్పుడు గుర్తుకొచ్చిందా? అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిలదీశారు. లగచర్ల ఘటన నుంచి ప్రజలను దృష్టిమళ్లించేందుకే కిషన్‌రెడ్డి మూసీ నిద్ర అని కొత్త నాటకమాడుతున్నారని ఆదివారం ఎక్స్ వేదికగా నిప్పులు చెరిగారు. కాంగ్రెస్‌కు రక్షణ కవచంగా బీజేపీ ఉన్నదని, ఆ రెండు పార్టీలవి తోడుదొంగల నాటకమని ధ్వజమెత్తారు.

మూసీ బాధితులకు భరోసా ఇచ్చి, బుల్డోజర్‌లను అడ్డుకుంటామని మొదటి నుంచీ స్పష్టం చేస్తున్నది బీఆర్‌ఎస్సేనని స్పష్టం చేశారు. కిషన్‌రెడ్డికి అకస్మాత్తుగా మూసీ బాధితులు గుర్తుకు రావడం వెనుక ఉన్న మతలబేంటని ప్రశ్నించారు. రేవంత్‌ను కాపాడటం కోసమే కిషన్‌రెడ్డి డైవర్షన్ డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. లగచర్ల రైతులను బీజేపీ విస్మరించిన చరిత్రను, కుట్ర రాజకీయాలను తెలంగాణ సమాజం గమనిస్తున్నదని, సమయం వచ్చినప్పుడు రాష్ట్ర కాంగ్రెస్, బీజేపీల బండారాన్ని బయటపెడుతుందని హెచ్చరించారు.

రాహుల్ పోరాటం బూటకం

అదానీ, అంబానీలపై రాహుల్ గాంధీ పోరాటం బూటకమేనని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో తమ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న బలవంతపు భూ సేకరణను అడ్డుకోకుండా రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా భూసేకరణపై రణగర్జన వినిపిస్తే ఏం లాభమని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీది, బీజేపీది కుమ్మక్కు రాజకీయం.. నేను కొట్టినట్టు చేస్తా.. నువ్వు ఏడ్చినట్టు చెయ్యి అనే ఒప్పందం.. కుమ్మక్కు రాజకీయంలో ఇదో రహస్యం.. అదానీ, అంబానీలపై రాహుల్‌గాంధీ పోరాటం ఓ బూటకం.. తెలంగాణకు కాంగ్రెస్ తరతరాల దరిద్రం' అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

> హైడ్రాను మొదట స్వాగతించింది.. సీఎం రేవంత్‌రెడ్డిని అభినందించింది కిషన్‌రెడ్డి, బీజేపీయే.. రేవంత్‌రెడ్డికి రక్షణ కవచంగా కమలదళం.. దోస్తును కాపాడేందుకు చీకటి రాజకీయం..వారెవ్వా తోడు దొంగల నాటకం.. అకస్మాత్తుగా బీజేపీకి మూసీ బాధితులు గుర్తుకు రావడం వెనకున్న మతలబేంటి? ఎవరిని కాపాడటం కోసం? ఎవరిని ముంచడం కోసం? ఎవరిని వంచించడం కోసం? **-కేటీఆర్**

> అదానీ, అంబానీలపై రాహుల్‌గాంధీ పోరాటం అంతా బూటకం.. తెలంగాణలో బలవంతపు భూసేకరణను అడ్డుకోకుండా దేశవ్యాప్తంగా భూ సేకరణపై రాహుల్‌గాంధీ రణగర్జన వినిపిస్తే ఏం లాభం? తెలంగాణలో భూసేకరణను మీ రణగర్జన ఎందుకు అడ్డుకోలేకపోయింది? కొడంగల్ రైతుల కన్నీటికి ఎందుకు కారణమైంది? అదానీ, అంబానీలపై మీ జంగ్.. రామన్నపేటలో అదానీ ఫ్యాక్టరీకి ఎందుకు ద్వారాలు తెరిపించింది? **-కేటీఆర్**

రైతులకు సంకెళ్లు వేసినందుకా సంతృప్తి?

రాష్ట్ర ప్రభుత్వ పాలనపై ఏఐసీసీ సంతృప్తి చెందిందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ మండిపడ్డారు. అసలు రాష్ట్రంలో పాలన ఉన్నదా? అని ప్రశ్నించారు. 'ఏఐసీసీ దేనికి సంతృప్తి చెందింది? అమాయకులైన అన్నదాతలను జైల్లో పెట్టినందుకా? కొనుగోలు కేంద్రాల్లో రైతులను బలిపశువులను చేస్తున్నందుకా? ఏడాది గడుస్తున్నా గ్యారెంటీ కార్డును పాతాళంలో పాతిపెట్టినందుకా? రెండు లక్షల ఉద్యోగాల హామీని గాలికి వదిలేసినందుకా? రాష్ట్రంలోని సకల రంగాలను, సబ్బండ వర్గాలను దగా చేసి తెలంగాణను ఆగం చేసినందుకా?.. లేక ఢిల్లీకి అందుతున్న వేల కోట్ల మూటలను చూశా?' అని నిలదీశారు. ఎంత మురిసిపోయినా మాటిచ్చి మోసం చేసిన ముఖ్యమంత్రిని, గ్యారెంటీ కార్డు ఇచ్చి గారడీ చేసిన కాంగ్రెస్ పార్టీని తెలంగాణ సమాజం విడిచిపెట్టదని, కనికరం లేని కాంగ్రెస్‌కు క్రరుకాల్చి వాతపెడుతుందని హెచ్చరించారు.

> రాష్ట్రంలో ప్రభుత్వ పాలనపై ఏఐసీసీ సంతృప్తి చెందిందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అంటున్నడు.. దేనికి ఏఐసీసీ సంతృప్తి చెందింది? రైతులకు సంకెళ్లు వేసినందుకా? బలవంతంగా భూములు గుంజుకుంటున్నందుకా? మూసీ పేరిట వేల ఇండ్ల కూల్చివేతకు సిద్ధమైనందుకా? హైడ్రాతో పేదలను భయపెడుతున్నందుకా? సబ్బండ వర్గాలను దగా చేసి తెలంగాణను ఆగం చేసినందుకా? దేనికి ఏఐసీసీ సంతృప్తి చెందింది? **-కేటీఆర్**

దేశ రాజధాని ఢిల్లీకి చేరుకున్న లగచర్ల బాధిత కుటుంబాలు, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

న్యాయం కోసం ఢిల్లీకి

- హస్తినకు లగచర్ల బాధితులు
- జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు నేడు ఫిర్యాదు
- జాతీయ మీడియా స్పందించాలని వేడుకోలు
- అన్ని వర్గాల మద్దతుకోసం విజ్ఞప్తులు
- బాధితులకు బాసటగా బీఆర్‌ఎస్

హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ) : ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం లగచర్ల ఫార్మా కంపెనీ బాధిత రైతు కుటుంబాలు ఆదివారం ఢిల్లీకి చేరుకున్నాయి. ఫార్మా కంపెనీలకు పచ్చని పొలాలను అతి తక్కువ ధరకే ధారాదత్తం చేసేందుకు కొందరు ప్రభుత్వ పెద్దలు ప్రయత్నిస్తుండగా భూముల సేకరణకు నిర్వహించిన సభలో వికారాబాద్ కలెక్టర్‌పై రైతులు తిరగబడ్డ విషయం తెలిసిందే.. తిరుగుబాటు తర్వాత ఆ రోజు అర్ధ రాత్రి పోలీసులు, కొందరు ప్రైవేట్ వ్యక్తులు గిరిజన ఆడబిడ్డల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన తీరును, తిరుగుబాటులో పాల్గొన్న గిరిజన రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన దారుణాన్ని జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు, జాతీయ మానవహక్కుల కమిషన్‌కు సోమవారం ఫిర్యాదు చేయన్నారు. బాధిత కుటుంబాలకు అండగా నిలిచిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు లగచర్ల గిరిజన కుటుంబాలతో కలిసి మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ ఢిల్లీ వెళ్లారు. ఆమెతోపాటు బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి, ఎస్టీ సెల్ కో ఆర్డినేటర్ ఎల్ రూప్ సింగ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు రామచంద్ర నాయక్, వాల్యా నాయక్, రాంబాల్ నాయక్ తదితరులు ఢిల్లీకి చేరుకున్నారు.

జాతీయ మీడియా స్పందించాలె..

తెలంగాణలో గిరిజన బిడ్డలపై జరిగిన, జరుగుతున్న దాష్టీకంపై జాతీయ మీడియా కూడా స్పందించాలని లగచర్ల బాధితులు వేడుకుంటున్నారు. పథకం ప్రకారం కరెంటు తీసి, అర్ధరాత్రి ఇండ్లలోకి చొరబడి, ఆడబిడ్డలను అసభ్యంగా తాకుతూ, పడుకున్నవారిని కూడా అట్లాగే పోలీస్ స్టేషన్లకు తరలించిన తీరుపై ప్రత్యేక కథనాలు రాయాలని కోరుతున్నారు. 'కొండగల్‌లో జరిగిన అరాచకాలను, ఆగడాలను వెలికితీయాలని కన్నీటి పర్యంతమవుతున్నారు. అధికారులపై తిరగబడిన కాంగ్రెస్, బీజేపీ సానుభూతి పరులైన కొందరు రైతులను తప్పించి, ఆ ఘటనతో సంబంధం లేని రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఉదంతాలను, తమ పోరాటాన్ని జాతీయస్థాయిలో వెలుగులోకి తేవాలని ప్రాధేయపడుతున్నారు. 'ఏ ఇంట్ల చూసినా ఆర్తనాదాలే విపిస్తున్నయి. వాటిని ఢిల్లీ స్థాయిల చూపించండి సారూ.. మీ బాంచెన్' అంటూ జ్యోతి అనే నిండు చూలాలు చేతులెత్తి ఢిల్లీకి వెళ్లి జాతీయ మీడియాను వేడుకుంటున్నది.

మద్దతు కూడగడుతున్న బాధితులు

తమకు జరిగిన అన్యాయాన్ని కండ్లకుకడుతూ బాధిత కుటుంబాలు న్యాయం కోసం మద్దతు కూడగడుతున్నాయి. ఢిల్లీలో లంబాడా హక్కుల పోరాట సమితి, ఎస్టీ సంఘాల ఐక్యవేదిక, భారత్ ముక్తి మోర్చా, ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్లను ఆశ్రయించి న్యాయం చేయాలని కోరుతామని పలువురు గిరిజనులు తెలిపారు. మరోవైపు లగచర్ల ఘటనపై అడిషనల్ డీజీ (లాఅండ్ ఆర్డర్) మహేశ్ భగవత్ సమగ్ర దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఫార్మా విలేజ్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు నెలకొన్న పరిస్థితులపై పూర్తి వివరాలు సేకరిస్తున్నట్టు సమాచారం. జిల్లాలోని ఉన్నతాధికారుల నుంచి కానిస్టేబుళ్ల వరకు స్టేట్‌మెంట్లను రికార్డు చేస్తున్నారు. నిఘా వైఫల్యంతోపాటు స్థానికంగా బందోబస్తు ఏర్పాటు చేయకపోవడానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

లగచర్ల ఘటనపై నివేదిక ఇవ్వండి

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ) : లగచర్ల ఘటనలో అమాయక గిరిజన రైతులను బలిచెయ్యొద్దని, లగచర్ల ఘటనపై రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు పూర్తి నివేదిక అందజేయాలని, పోలీస్ హింసకు గురైన బాధితులకు తక్షణం వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్, ఎస్పీలను రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. బాధిత రైతులు రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసి తమ వ్యవసాయ భూములను బలవంతంగా గుంజుకుంటున్నారని, కలెక్టర్‌పై దాడి సాకుతో పోలీసులు అమాయక రైతులను అరెస్టు చేస్తూ వేధిస్తున్నారని ఫిర్యాదు చేయగా ఆయన స్పందించారు. ఆదివారం కలెక్టర్, ఎస్పీలకు ఫోన్ చేసి లగచర్ల ఘటనపై చైర్మన్ బక్కి వెంకటయ్య ఆరా తీశారు.

నేడు లగచర్లకు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు

కొడంగల్, నవంబర్ 17 : లగచర్ల గ్రామాన్ని సోమవారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జలోతు హుస్సేన్ సందర్శించనున్నారు. ఉదయం 9 గంటలకు ఆయన హైదరాబాద్‌లో బయల్దేరి మధ్యాహ్నం 12 గంటలకు గ్రామస్థులతో మాట్లాడుతారు. అక్కడి నుంచి సంగారెడ్డి జైలుకు వెళ్లి బాధితులను కలువనున్నారు.

సీఎం ఇలాకాలోనే రక్షణ కరువు

హైదరాబాద్, నవంబర్17 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్ సొంత నియోజకవర్గంలోనే పేదలకు రక్షణ లేకుండా పోయిందని ఢిల్లీలో జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు రాష్ట్రంలోని వివిధ ప్రజా సంఘాలు ఫిర్యాదు చేశాయి. లగచర్ల బాధితులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాయి.

లగచర్ల గిరిజన రైతులను వేధించొద్దు

- ఉట్నూర్ డివిజన్, నార్నూర్ మండల కేంద్రాల్లో బంజారాల నిరసన

ఉట్నూర్/నార్నూర్, నవంబర్ 17: కొండగల్‌లో గిరిజన రైతులను ప్రభుత్వం వేధించొద్దని, వారిపై అక్రమ దాడులను ఆపాలని బంజారాలు నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. ఆదివారం ఆదిలాబద్ జిల్లా ఉట్నూర్ డివిజన్ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మాజీ జడ్పీటీసీ రాథోడ్ జనార్దన్ ఆధ్వర్యంలో.. నార్నూర్ మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద పీఏసీఎస్ చైర్మన్ ఆడే సురేశ్ ఆధ్వర్యంలో గిరిజనులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కలెక్టర్ తనపై దాడి జరగలేదని చెప్తున్నా.. ప్రభుత్వం లంబాడీ రైతులపై కక్షగట్టి హింసిస్తున్నదని విమర్శించారు. ఫార్మా సిటీకి భూములు తీసుకోవాలన్న ఉద్దేశంతో వారిపై కేసులు నమోదు చేస్తున్నదని ఆరోపించారు. వారిని విడుదల చేయడంతోపాటు కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

లగచర్ల బాధితులను వేధించొద్దని ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

లగచర్లపై రజాకార్ల దాడి!

- మహిళలపై కాంగ్రెస్ దాష్టీకం
- భూ సేకరణ కోసం ఎంతకైనా తెగిస్తారా?
- గొంగిడి సునీత ఆగ్రహం

హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): లగచర్లలో రైతుల ఇండ్లపై జరిగిన దాడి రజాకార్లను తలపిస్తున్నదని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. నాడు రజాకార్లు చేసిన అరాచకాలకు రైతులు తిరగబడితే ఏం జరిగిందో చరిత్ర చెప్తుందని, సీఎం రేవంత్‌రెడ్డి లగచర్లలో ఆ చరిత్రను పునరావృతం చేయాలనుకుంటున్నారని విమర్శించారు. నమ్మి ఓట్లేసిన సొంత నియోజకవర్గ ప్రజలను రేవంత్‌రెడ్డి నిరాశ పర్చారని దుయ్యబట్టారు. భూసేకరణ కోసం ఎంతకైనా తెగిస్తారా? అని ఆగ్రహం వ్యక్తంచేశారు.

నాడు విషం.. నేడు సువాసనా?

- ఎటు కుదిరితే అటే మాట్లాడుతరా?
- పిలువకున్నా వచ్చినోళ్లు ఇప్పుడేరి?
- పేదల భూములు గుంజుకొని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతరా?
- ఇకనైనా భూ సేకరణ మానుకోవాలి
- ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ

హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ) : 'నాడు ప్రతిపక్షంలో ఉన్న రేవంత్‌రెడ్డితో సహ ఇతర కాంగ్రెస్ పెద్దలకు.. విషం చిమ్మేలా కనిపించిన ఫార్మా కంపెనీలు, నేడు సువాసన వెదజల్లే కంపెనీలుగా కనిపిస్తున్నయా?' అని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నిలదీసింది. ఈ మేరకు ఆదివారం పలువురు రైతులతో కూడిన కమిటీ ప్రకటన విడుదల చేసింది. 'నాడు ఫార్మా అంటేనే భూతం, ఒక్క సిరీస్ కంపెనీతోనే 30 ఏండ్ల తర్వాత కూడా కాలుష్యం పోలేదు. ఫార్మాసిటీకి భూములు ఇవ్వొద్దు. మేం అధికారంలోకి వస్తే ఫార్మా రద్దు, భూసేకరణ రద్దు' అని చెప్పారని, నేడు అదే ఫార్మా సిటీ కోసం రైతుల భూములు గుంజుకొంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేసింది. 'కాలుష్యంతో ఎంతోమంది ప్రాణాలు బలితీసుకున్న అరబిందో, డాక్టర్ రెడ్డీస్ వంటి క్రిమినల్ కంపెనీలకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారు' అని మండిపడింది. 'ఎటు కుదిరితే అటు మాట్లాడటం కాంగ్రెస్ నాయకులకు అలవాటైంది. ప్రభుత్వంలో ఉన్న పెద్దలకు ఎన్ని లేఖలు రాసినా వారికి రైతులు కనిపించటం లేదు. ఒకప్పుడు పిలవకున్నా వచ్చి మా ఊర్లలో తిరిగిన కాంగ్రెస్ నాయకులు, ఈ రోజు భూతద్దంతో వెతికినా కనిపించటం లేదు' అని దుయ్యబట్టింది. 'ఆ రోజు రైతుల పాదయాత్రలో వచ్చిన మల్‌రెడ్డి రంగారెడ్డి.. రైతుల భూముల కోసం ఎన్ని పోరాటాలైనా చేస్తానని మాటిచ్చిండు.. ఇప్పుడు మాగోడు వినేవారే లేకుండా పోయిండ్రు.. నాడు ఎన్నికలప్పుడు మల్‌రెడ్డి రంగారెడ్డికి ఓటు వేయాలని చెప్పిన ముదిరెడ్డి కోదండరెడ్డి.. ఇప్పుడు మా తరఫున పోరాటం చెయ్యాలని అడిగితే సమాధానం చెప్తలేడు.. ఇప్పుడు తనకేం సంబంధం లేదంటున్నడు. ప్రభుత్వం మాటమార్చి ఫార్మాసిటీ రద్దు చేయలేదని కోర్టులో ఒప్పుకొన్న తర్వాత కూడా ఆయన మా గురించి ఒక్క మాట కూడా మాట్లాడ్తలేడు' అని కమిటీ రైతులు పేర్కొన్నారు.

పేదల భూములు కార్పొరేట్లకా?

ఒకప్పుడు దొరల వద్ద బానిసలుగా బతుకున్న ప్రజలకు ఇందిరా గాంధీ.. భూములు పంచారని, ఈ రోజు ఆమె పేరు చెప్పుకొని రాజకీయ లబ్ధి పొందుతున్న నాయకులు, అవే భూములను లాక్కొని కార్పొరేట్ దొరలకు ముట్టజెప్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నికల ముందు.. ఇందిరా గాంధీ ఇచ్చిన భూములు అన్యాయంగా, అక్రమంగా గుంజుకున్నారని రైతుల పక్షాన మాట్లాడిన కాంగ్రెస్ పెద్దలు.. ఇప్పుడు ఇవ్వని భూములు కూడా గుంజుకుందామని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కొడంగల్ ఘటన తర్వాత బీజేపీ నాయకులు కూడా సుద్ద పూసల్లాగ మాట్లాడుతున్నారని పేర్కొన్నారు.

భూసేకరణను రద్దు చేయాలి

నిజంగా ప్రజల కోసమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పనిచేస్తుంటే ఫార్మాసిటీని, దాని కోసం చేస్తున్న భూసేకరణను తక్షణం రద్దు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. బీజేపీ నేతలు కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్ తమతో కలిసిరావాలని కోరారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏ విధంగా అయితే ఫార్మా విలేజ్‌ని రద్దు చెయ్యిమంటున్నారో అదేవిధంగా యాచారం ప్రాంతంలో ఫార్మాసిటీని కూడా రద్దు చేసేలా బీజేపీ నాయకులు ఒత్తిడి తేవాలని కవుల సరస్వతి, కేస్‌దాస్ పసుల కాపరి, సమ నిరంజన్, కనేమోని గణేశ్, మర్రి భగవంతరెడ్డి, ముత్యాల మహిపాల్‌రెడ్డి, కల్లు కొండలరెడ్డి, అద్దేకర్ దేవోజీ, పాడి రైతు సోమయ్య, బొద్దు సందీప్‌రెడ్డి, ఆరేపల్లి లింగం, జక్కుల వెంకటేశ్, విస్లావత్ శంకర్, కే పాండురంగాచారి కోరారు.

ఫార్మర్ పొట్టకొట్టి.. ఫార్మాకు నీళ్లు!

మొదటిపేజీ తరువాయి...

కొల్లాపూర్, కొత్తకోట, దేవరకద్ర మండలాల రైతుల పంట భూములను ఎండబెట్టి, కృష్ణా జలాలు యథేచ్ఛగా మళ్లించుకొని కొడంగల్‌కు పట్టుకుపోయేందుకు కసరత్తు పూర్తి అయింది. ఈ మేరకు ఎన్‌కేఎల్‌ఐఎస్ రెండవ దశ ప్రాజెక్టు పనులకు డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారుల మీద ఒత్తిడి తెస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది.

కాంగ్రెస్ హయాంలో క్రాప్‌హాలిడే

భీమా ఫేజ్-1, ఫేజ్-2 ఎత్తిపోతల పథకం కింద 2 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలని నిర్ణయించినా.. ఉమ్మడి రాష్ట్రంలో ప్రాజెక్టు పనులనే పూర్తి చేయలేదు. తెలంగాణ ఏర్పాటు అనంతరమే కేసీఆర్ భీమా ప్రాజెక్టును ఆధునీకరించి 1.98 లక్షల ఎకరాల ఆయకట్టును నిర్ధారించారు. జూరాల ప్రాజెక్టులో నిండుగా నిల్వ జలాలు ఉన్నప్పుడు మాత్రమే ఎగువ నుంచి వచ్చే వరద నీటిని సమాంతర కాల్వకు వదులుతారు. అంటే వానాకాలంలో మాత్రమే భీమా ఫేజ్-1, ఫేజ్-2 లిఫ్టులకు నీళ్లు అందుతాయి. ఎత్తిపోసిన నీళ్లతో శంకర సముద్రం, కృష్ణ సముద్రం, రంగ సముద్రం, ఎనుగొండ రిజర్వాయర్లను నింపి ఆయకట్టుకు వదులుతున్నారు. కేసీఆర్ హయాంలో అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రాజెక్టు మీద ప్రత్యేక దృష్టి పెట్టి 1.58 లక్షల ఎకరాలకు నీళ్లు అందించగలిగారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఈ ప్రాజెక్టును పట్టించుకున్న వారే లేరు. భీమా లిఫ్ట్‌కు నీళ్లు అందించే జూరాల ప్రాజెక్టు క్రస్ట్‌గేట్ల లీకేజీలతో నిత్యం 100 నుంచి 150 క్యూసెక్కుల నీరు వృథాగా పోతోంది. దీంతో భీమా ఆయకట్టు మరింత తగ్గింది. గత యాసంగిలో భీమా ప్రాజెక్టు కింది ఆయకట్టుకు ప్రభుత్వం క్రాప్ హాలీడే ప్రకటించింది.

వైఎస్ బాటలో రేవంత్

భీమా ప్రాజెక్టు కింద ఆయకట్టుదారుల వాస్తవ పరిస్థితి ఇట్లా ఉండగా.. కాల్వలను ఆధునీకరించటం వలన 7 టీఎంసీల జలాలు మిగులుతున్నాయని, ఈ మిగులు జలాలనే ఎన్‌కేఎల్‌ఐఎస్ ప్రాజెక్టుకు తరలిస్తున్నట్టు నీటిపారుదల అధికారుల చేత చెప్పిస్తూ రైతులను మోసం చేస్తున్నారు. కృష్ణా నదిలోని వరద నీళ్లను మాత్రమే తీసుకుంటామని చెప్పి గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు కట్టినట్టే.. ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భీమా ప్రాజెక్టు ఆయకట్టుదారులను మోసం చేస్తూ ఎన్‌కేఎల్‌ఐఎస్ ప్రాజెక్టు కడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భీమా ఫేజ్ 1 నీళ్లనే నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతలకు లింక్ చేస్తున్నారు. మొదటి దశలో రూ.1,134.62 కోట్లు ఖర్చు చేసి నీళ్లు భూత్పూరు జలాశయం వరకు తీసుకువస్తారు. మళ్లీ అక్కడి నుంచి నీళ్లను ఎత్తిపోసి కనుకుర్తి వరకు తీసుకుపోతారు. రెండో ప్యాకేజీలో రూ.1,126.23 కోట్లు వ్యయంతో ఊట్కూరు, కనుకుర్తి పంపింగ్ స్టేషన్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఈ మేరకు టెండర్లు కూడా ఖరారు అయ్యాయి.

ఫార్మా క్లస్టర్‌కు కృష్ణా నీళ్లు

రెండవ దశలో దుద్యాల మండలంలోని లగచర్ల, హకీంపేట, పోలేపల్లి, రోటిబండ తండా, పులిచర్లకుంటతండా పరిధుల్లో సుమారు 1,375 ఎకరాల్లో ఫార్మా విలేజ్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. అనుకున్నది అనుకున్నట్టు సాగితే.. తొలి దశలో 8 ఫార్మా కంపెనీల నిర్మాణానికి ప్రైవేటు యాజమాన్యం ముందుకొచ్చింది. ఇందులో మేజర్ ఫార్మా కంపెనీలు ముఖ్యనేత బంధువులకు చెందినవే అనే ప్రచారం ఉంది. ఇవి కాకుండా మరో 5-6 ఫార్మా కంపెనీలు మలి దశలో వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. పెద్ద ఫార్మా కంపెనీకి రోజుకు కనీసం 20 నుంచి 25 వేల గ్యాలన్ల నీళ్లు అవసరం పడుతాయని, ఈ లెక్కన 10-15 ఫార్మా కంపెనీలకు 3 నుంచి 4 లక్షల గ్యాలన్ల నీళ్లు అవసరపడుతాయని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు. ఫార్మా క్లస్టర్‌కు అవసరమైన నీళ్లు తోడుకోవటానికి వీలుగా దుగ్యాల మండలంలోని ఉస్నాబాద్ పెద్ద చెరువును ఆధునీకరించటానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రస్తుతానికి 1000 ఎకరాలకు నీళ్లు అందించే సామర్థ్యం ఉన్న చెరువు పరిధిని విస్తృతంగా పెంచి, కనీసం 0.05 టీఎంసీల జలాలను నిల్వ చేసుకునే విధంగా ఆధునీకరించటానికి ప్రతిపాదనలు తయారు అయ్యాయి. భూసేకరణ ముగిసి,ఇండస్ట్రీల నిర్మాణం పూర్తై, ఉత్పత్తులు ప్రారంభించటానికి రెండున్నర నుంచి మూడేండ్లు పట్టే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. పరిశ్రమలు పని ప్రారంభించే నాటికి అవసరమైన జలాలు అందుబాటులో ఉంచే విధంగా ఎన్‌కేఎల్‌ఐఎస్ ప్రాజెక్టు పనులను ఇరిగేషన్ శాఖ ఇంజినీర్లు డిజైన్ చేసినట్టు సమాచారం.

సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబునాయక్

గిరిజనుల బతుకులపై ఫార్మా విషం

- బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం
- సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు నాయక్

ఖైరతాబాద్, నవంబర్ 17: గిరిజనుల బతుకులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మా విషం చిమ్మే కుట్రలుచేస్తోందని సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు అంగోతు రాంబాబు నాయక్ ఆగ్రహం వ్యక్తంచేశారు. లగచర్ల ఫార్మా బాధితులకు మద్దతుగా సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గ్రీన్‌ఫీల్డ్ కంపెనీ ఏర్పాటు కోసం ప్రభుత్వం 1358 ఎకరాల భూ సేకరణ చేపడుతుందని, అందులో 721ఎకరాల పట్టా భూములు కోల్పోవడంతో 4వేల మంది గిరిజనులు రోడ్డునపడుతారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజా ప్రభుత్వమని చెప్పుకొని గిరిజనుల భూములు గుంజుకుంటూ వారిపైనే కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు ఓట్లు వేసి తప్పుచేశామని గిరిజనులు భావిస్తున్నారని, లగచర్ల బాధితులకు న్యాయం చేయాలని సోమవారం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌కు వినతిపత్రాలు అందజేస్తామని చెప్పారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేవరకు చలో లగచర్ల నిర్వహించి ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనాలతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని చెప్పారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురాం రాథోడ్, ప్రధాన కార్యదర్శి రేఖానాయక్, ఉపాధ్యక్షులు పత్లావత్ రవినాయక్, గుగులోతు రవినాయక్, రఘు సునీతాబాయి, రవీందర్‌నాయక్, మోతీలాల్‌నాయక్, పండరీ నాథ్ నాయక్, అభినాయక్ పాల్గొన్నారు.

మరో ఆటోడ్రైవర్ ఆత్మహత్య

- ఫైనాన్స్‌లో అప్పు చేసి ఆటో కొనుగోలు
- ఆటో సరిగా నడవక ఆర్థిక ఇబ్బందులు
- నెలవారీగా కిస్తీలు చెల్లించలేక మనస్తాపం
- ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణం
- నిజామాబాద్ జిల్లా మోకన్‌పల్లిలో విషాదం

టేకు కర్ణ (ఫైల్)

నవీపేట, నవంబర్ 17: ఫైనాన్స్ కిస్తీలు కట్టలేక మరో ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం మోకన్‌పల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన టేకు కర్ణ (35) ఉపాధి కోసం రెండేండ్ల క్రితం గల్ఫ్‌కు వెళ్లి వచ్చాడు. కుటంబ పోషణ కోసం ఫైనాన్స్‌లో అప్పు చేసి ప్యాసింజర్ ఆటో కొనుగోలు చేశాడు. ఓ వైపు ఆటో సరిగ్గా నడవక ఫైనాన్స్‌లో తీసుకున్న అప్పులకు నెలనెలా కిస్తీలు సక్రమంగా కట్టక ఇబ్బందులు పడుతున్నాడు. మరోవైపు ఫైనాన్స్ నిర్వాహకులు కిస్తీలు కట్టాలంటూ కర్ణపై ఒత్తిడి చేస్తున్నా. దీంతో కొన్ని రోజులుగా తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. అప్పు లు తీర్చే మార్గం కనిపించక మనస్తాపం చెందాడు. ఆదివారం బంధువుల పెండ్లి ఉండటంతో ముం దుగా భార్య, పిల్లలను పంపించాడు. అనంతరం కర్ణ ఇంట్లోని ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ఫిర్యా దు మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడికి నలుగురు పిల్లలు, భార్య పుష్ప ఉన్నారని, కేసు దర్యాప్తులో ఉందని స్థానిక ఎస్సై వినయ్ తెలిపారు.

మరో రైతు ఆత్మహత్య

- సిద్దిపేట జిల్లా చిన్నకోడూరులో ఉరివేసుకొని బలవన్మరణం

చిన్నకోడూరు, నవంబర్ 17 : సిద్దిపేట జిల్లా చిన్నకోడూరులో ఆర్థిక ఇబ్బందులతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నకోడూరుకు చెందిన కర్నే రాంరెడ్డి (70) అతడి తమ్ముడు యాదగిరిరెడ్డికి మధ్య భూ వివాదం ఉన్నది. గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీలు నిర్వహించినా సమస్య పరిష్కారం కాలేదు. ఆర్థికసమస్యలతోపాటు తల్లి పోషణ గురించి వారం రోజులుగా దిగాలు చెందుతున్నాడు. ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు లేచి పొలం వద్దకు వెళ్లి వస్తానని చెప్పి, పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఉదారత చాటుకున్న ఆర్టీసీ సిబ్బంది

- టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ప్రశంస

హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ) :బస్సులో తీవ్ర అవస్థకు గురైన ప్రయాణికురాలిని సకాలంలో దవాఖానకు తరలించి ఆర్టీసీ సిబ్బంది తమ ఉదారతను చాటుకున్నారు. హైదరాబాద్-కల్వకుర్తి రూట్ బస్సులో ఆదివారం నందిని అనే మహిళ ప్రయాణిస్తుండగా..తుక్కుగూడ సమీపంలోకి వచ్చాక ఆమెకు తీవ్రమైన కడుపునొప్పి వచ్చింది. గమనించిన కల్వకుర్తి డిపో కండక్టర్ శశికళ.. డ్రైవర్ అంజయ్యను అప్రమత్తం చేశారు. బస్సును ఆపించి అంబులెన్స్‌కి సమాచారం ఇచ్చారు. అంబులెన్స్‌లో ఆమెని కడ్తాల్ ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. సకాలంలో వైద్యం అందేలా చొరవ తీసుకున్న కండక్టర్ శశికళ, డ్రైవర్ అంజయ్యను టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ప్రశంసించారు. ప్రజలకు మెరుగైన రవాణా సేవలందించడంతో పాటు మానవత్వం చాటుకోవడంలోనూ తక్కువ కాదని ఆర్టీసీ సిబ్బంది నిరూపిస్తుండడం సంతోషదాయకమని ఆదివారం ఎక్స్ వేదికగా ఎండీ వెల్లడించారు.